


''మిత్రులారా! మీరేనా?! ఇంతసేపూ గమనించనే లేదు సుమా!'' అంటూ ఘోటకముఖుడు వచ్చి వారిని కౌగిలించుకున్నాడు.

మిత్రులు ముగ్గురూ కలుసుకున్న ఆనందంలో ఉండగా.. సభలోని కవి పండితులు శాస్త్రవిషయాల్లో కొన్ని ప్రశ్నలు వేశారు. కుచుమారుడు అన్నిటికీ సరైన సమాధానాలు చెప్పాడు.

''ఇతనే కుచుమారుడు. ఇతనే సరస్వతిని ఓడించిన వాడు'' అని సభ తీర్మానించింది.

మోసం చేసి తానే కుచుమారుడినని ప్రకటించుకున్న శంబరుణ్ని తీవ్రంగా శిక్షించాలని సభ ప్రతిపాదించింది. కానీ కుచుమారుడు ఒప్పుకోలేదు. ''దయచేసి అతణ్ని విడిచిపెట్టండి. అతని తండ్రి ఇచ్చిన సలహా మేరకే నేను సరస్వతిని గెలుచుకున్నాను. అతనే లేకపోతే నాకీ విజయమే లేదు. కనుక, శంబరుణ్ని వీలైతే సత్కరించండి. శిక్షించవద్దు'' అని కోరాడు.

పురందరపురం అధిపతి హిరణ్యగర్భుడు అందుకు అంగీకరించి.. సభ వారు చేసిన ధర్మనిర్ణయాన్ని కుమారైకు తెలియచేశాడు.

ఆనాటి సాయంత్రం కుచుమారుని వద్దకు సరస్వతి మరో చిలుకను పంపించింది. పూర్వంలాగే.. తన మెడలోని సిద్ధుని అస్థిమాలను చిలుక మెడలో వేశాడు కుచుమారుడు. ఈసారి పాతచిలుక కంటే కొత్తచిలుక మరింత పండితురాలైంది. దాని వైదుష్యాన్ని చూసి సరస్వతి మరింత మురిసిపోయింది.

'ఇతనే కుచుమారుడు' అని తండ్రికి ధ్రువీకరించింది. ఆ మరునాడే మిత్రులందరి మధ్య ఘోటకముఖుడు ఇలా చెప్పాడు.

''మిత్రులారా! మిమ్మల్ని కలుసుకోవడానికి నేను ధారానగరానికి వస్తున్నాను. దారిమధ్యలో అడవిలో ఒకచోట ఒక యువతి మెడకు ఉరిపోసుకుంటూ కనిపించింది. నేను పరుగున వెళ్లి రక్షించాను. ఆత్మహత్య మహాపాపమని చెప్పి ఆమె ప్రయత్నం మాన్పించాను. తనను సురక్షితమైన చోటికి చేర్చుతానని నమ్మించి, నాతోపాటు తీసుకు వెళ్లసాగాను.

కొంతదూరం వెళ్లేసరికి మాకు ఒక దుష్టతాంత్రికుడు ఎదురుపడ్డాడు. వాడు ఎలుగుబంట్లను, చిరుతలను, కుక్కలను మెడలకు తాళ్లుకట్టి నడిపిస్తూ వెళ్తున్నాడు. వాణ్ని చూసి, నేను ఆ యువతి దారిపక్కగా తొలగి చూస్తున్నాం. ఇంతలో వాడి కన్ను ఆమెపై పడనే పడింది. ఆమెను దగ్గరికి రమ్మని చేతితో సంజ్ఞ చేశాడు. ఆమె గమనించ లేదు. దాంతో వాడే మా దగ్గరికి వచ్చాడు. నేను వాడి దగ్గరున్న జంతువులను చూసి భయపడుతూనే..

'అయ్యా! ఈమె నా చెల్లెలు. ధారానగరం పోతున్నాం. దయచేసి మమ్మల్ని మా దారిన పోనివ్వండి' అని అడిగాను.

దానికి వాడు వికటంగా నవ్వుతూ.. కుక్కల తాళ్లు వదిలేశాడు. అవి నామీదికి వచ్చాయి. నేను భయపడి పరిగెత్తాను. నన్ను కొంతదూరం తరిమిన తరువాత ఆ కుక్కలు వెనక్కు వెళ్లిపోయాయి. నేను వెనుతిరిగి వచ్చి.. ఆమెకోసం వెతికాను. అయితే, ఆమె కానీ, తాంత్రికుడు కానీ కనిపించలేదు. అనవసరంగా పాపం ఆ యువతిని దుర్మార్గుడి పాలు చేశానని చింతిస్తూ ధారానగరం దిశగా ప్రయాణించసాగాను''

..ఘోటకముఖుడు ఈ కథను ఇంతవరకూ చెప్పి, తన పక్కన ఉన్న భోజమహారాజును చూపించాడు. తదుపరి మళ్లీ ఇలా చెప్పసాగాడు.

''ఇదిగో ఈయన ఆ అడవిలోనే ఎదురయ్యాడు. ఆ తాంత్రికుడి చేతిలో చిక్కుకున్నది ఈయన భార్యేనని తెలిసింది. ఇంతకూ ఈయన ఊరేమిటో.. పేరేమిటో కూడ నేను అడగలేదు. ఈయన చెప్పలేదు. ముఖం చూస్తుంటేనే ఏదో గొప్ప అధికారమున్నవాడని అర్థమవుతున్నది. అదీకాకుండా నేనా యువతిని రక్షించాను. ఆమెను తన భర్త దగ్గరికి చేర్చడం నా విధి అని నమ్ముతున్నాను.

కుచుమారా! నీ వివాహానికి నేను కూడా ఉండాలని ఉంది. కానీ ఇప్పుడు సమయం లేదు. ఈయన భార్యను ఎత్తుకువెళ్లిన వాడి పేరు భైరవుడని తెలుసుకోగలిగాం. వాడు అల్లాణ భూపతి పాలిస్తున్న ఏకశిలానగరంలో ఉన్నాడని తెలిసింది. నేను ఈయనతో పాటు వెళ్లి.. ఆ భైరవుణ్ని చూపించాలి.

మన మిత్రులైన దత్తకుడు, గోణికాపుత్రుడు, సువర్ణనాభుడు కూడా ధారానగరంలోనే ఉన్నారని రూఢిగా తెలిసింది. చారాయణుడు వివాహం చేసుకున్నాడు. అతను కూడా ఈపాటికి ధారానగరానికి చేరి ఉంటాడు. మీరు ఈ పెళ్లి తరువాత అక్కడికే వెళ్లండి. వీరి భార్య దొరికిన తరువాత వీరితోపాటే నేనూ వస్తాను''..

ఇలా చెప్పి ఘోటకముఖుడు, భోజమహారాజుతో కలిసి.. అల్లాణ భూపతి పాలించే ఏకశిలానగరానికి వెళ్లాడు.

తదుపరి లగ్నానికే సరస్వతి కుచుమారుల వివాహం జరిగింది.

* * *

అల్లాణ భూపతి గొప్ప శివభక్తుడు. అతనికే భళ్లానుడని మరో పేరుంది. గొప్ప శివార్చన పరుడు. సర్వవిద్యా లాలసుడు. కవీంద్రులను, పండితులను ఆదరిస్తుంటాడు. వదాన్యతలో శిబి కర్ణ దధీచులనే మించిపోతాడని చెప్పుకొంటారు.

అతని భార్యపేరు సువ్రత. అరుంధతిలో సైతం తప్పులు పట్టగల మహాసాధ్వి అని పేరు. ఆమె సుగుణాలను వర్ణించడం సామాన్యులకు సాధ్యం కాదు.

అల్లాణుడికి ఒక వ్రతం ఉంది. నిత్యం పదిమంది అతిథులనైనా మహేశ్వర రూపంగా అర్చించకుండా.. వారికి భోజనం పెట్టకుండా, వారి కోరినది ఇచ్చి పంపకుండా తాను భుజించడు.

అలా ఉండగా ఒకనాడు అతని వద్దకు విభూతి, రుద్రాక్షలను దాల్చిన పశుపతి అనే సిద్ధుడు వచ్చాడు. అపర మహేశ్వరునిగా కనిపిస్తున్న అతణ్ని రాజు అర్చించాడు. భోజనం పెట్టాడు.

తదుపరి తమ కోరిక ఏమిటని అడుగగా పశుపతి..

''వద్దులే మహారాజా! ఇప్పుడు నా మనసులో ఉన్న కోరికను చెప్పుకోవడం సిగ్గుచేటు. దానిని తీర్చడానికి నీవంటి ప్రభువులు పూనుకోనక్కరలేదు. నేనే నెరవేర్చుకోగలను. నన్ను పోనివ్వు'' అన్నాడు.

''అదేమిటి మహాశయా! నేను మీకు కానుకగా ఏ వస్తువునైనా సమర్పించకుండా నా వ్రతం పూర్తికాదు. దయచేసి మీ మనోరథం ఏమిటో సెలవివ్వండి'' అని ప్రార్థించాడు భూపతి.

''వద్దు మహారాజా! నేనా కోరిక చెబితే నాతోపాటు నువ్వు కూడా అపకీర్తి మూటగట్టుకోవాల్సి వస్తుంది'' అన్నాడు పశుపతి.

''పరవాలేదు. ఏది ఏమైనా సరే.. దానిని తీర్చక తప్పదు'' అని పట్టుబట్టాడు భూపతి.

అప్పుడు పశుపతి..

''చెబుతున్నాను విను. నువ్వు కోరిక చెప్పమని అడిగిన సమయానికి నా మనసులో వేశ్యసంగమాభిలాష కలిగినది. నేటి రాత్రికి ఏ విటుని అధీనంలోనూ లేని వారకాంతను తెచ్చి, నాకు సమర్పించాలి. కులాంగన పనికిరాదు. వేరొక విటుడు ముందుగానే ఒడంబడిక చేసుకున్నట్లయితే అట్టి వేశ్యను కూడా నేను కూడను'' అని గంభీరంగా పలికాడు పశుపతి.

''ఓహో! ఇదెంత భాగ్యం. రాత్రి వరకు మీరు మా అంతఃపురంలోనే ఉండండి. నేటి రాత్రికి మీ మనోరథం ఈడేరగలదు'' అని మాటిచ్చి అక్కణ్నుంచి కదిలాడు అల్లాణ భూపతి.

సిద్ధుని మనోరథం చెల్లించాలని అల్లాణ భూపతి ఎంతగానో ప్రయత్నించాడు. ఏకశిలానగరంలో ఉన్న వేశ్యకాంతలందరి ఇళ్లకూ అధికారులు వెళ్లారు. చిత్రంగా ఆనాటి రాత్రి ఒక్క వేశ్య కూడా ఖాళీగా లేదు. అబద్ధం చెబితే రాజు తల తరిగేస్తాడు కనుక, అధికారులు ఉత్తచేతులతో వెనుతిరిగి వచ్చారు.

అల్లాణ భూపతి తాను చేపట్టిన వ్రతం భంగం అయిందని అల్లాడసాగాడు.

అటువంటి తరుణంలో అతని భార్య అయిన సువ్రత వచ్చి ఎదుట నిలబడింది.

''నాథా! వారకాంత దొరకలేదని.. వ్రతభంగం కాగలదని మీకంత బాధ ఎందుకు?! మీరు అనుమతిస్తే నేను వెళ్తాను'' అని పలికింది.

భార్య మాటలు విని అల్లాణుడు పొంగిపోయాడు.

''వ్రతం విడిచిపెట్టాల్సి వస్తుందేమో అనుకున్నాను. నువ్వు పోయి ఆయన్ను మహేశ్వరునిగా ఎంచి కామితం తీర్చు. నీకు ఏ దోషమూ అంటనేరదు. అన్నట్లు నువ్వు రాజు భార్యనని చెప్పకూడదు సుమా!'' అని సుద్దులు చెప్పి పంపాడు.

సువ్రత చక్కగా అలంకరించుకుని పశుపతి ముందుకు వెళ్లి నిలబడింది.

సుందరాంగి అయిన వారాంగన పొందుకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న పశుపతి ఆమె రాకతో అదిరిపడ్డాడు. ■

**(వచ్చేవారం.. భోజకాళిదాసుల సమ్మేళనం)**